వెలుగు రేఖ

మధ్యాహ్నం ఎండ చిరచిరలాడుతోంది. వర్షాకాలమైనా వానలెక్కడివి. ఎప్పుడైనా మబ్బుతునకలు కనిపించి సూర్యుడి వేడికి భయపడి పారిపోతున్నట్లే ఉన్నాయి. ఎండన పడి వచ్చిన నాకు ఆఫీసు ఏ.సి.తో ప్రాణం లేచొచ్చినట్లయింది. బ్యాగు బరువు దించుకుని చూస్తే ఆఫీసంతా కోలాహలంగా అనిపించింది. చిన్నగా నవ్వుకున్నాను. 'ఉండదూ మరి - అందునా అరియర్స్ అందుకోబోతున్న రోజాయె' అందరూ ఎప్పుడో లెక్కలు కట్టేశారు. ఎవరికెంతొస్తుందని రణగొణగా ఉన్న అందరి డిస్కషన్సూ ఎవరెలా ఖర్చుపెట్టబోతున్నారన్న దానిపైనే.

పక్కసీటు పద్మ ఉత్సాహంగా పలకరించింది. "ఏమండీ! మా ఆయన నేను గాజులు కొనుక్కుందుకు ఒప్పుకున్నాడు తెల్సా" అంటూ. మా అందర్లోకి పెద్దదయిన రాధా మేడమ్ అందుకుని "అవునమ్మాయ్! ఇప్పుడే అన్నీ కొనుక్కుని ఎంజాయ్ చెయ్యడమే బెటర్! లేదంటే ఇదిగో నాలా మొత్తం పిల్లల ఖర్చులకే సరిపోతుంది. ఒక సరదా లేదూ పాడూ లేదు" అని నిట్టూర్చింది.

ఎదురు సీటు సుబ్బారావుగారేమో ఫ్లాటు కొనుక్కోలేకున్నా అడ్వాన్సన్నా ఇచ్చేస్తాట్ట. మిగిలింది కాసింతా మాంగారు సర్దకపోతారన్న ఆశ ఆయనది.

ఇంతమంది ఆశలూ తీరాలంటే ఈ అరియర్సేవిటి ఆఫీసు బడ్జెట్టే సరిపోదు అనుకుంటే నవ్వొచ్చింది. ఆలోచనల్ని తుంచేస్తూ అడిగింది వసుధ "నువ్వేం కొంటున్నావని".

"ఆలోచించాలి. ఇంతవరకూ ఏదీ నిర్ణయమవ్వలేదు. నాకూ ఎన్నాళ్లబట్టో రవ్వలదుద్దులు కొనుక్కోవాలన్న కోరిక."

సాయంకాలం బయల్దేరేప్పటికి సగం దారిలో చినుకులు మొదలయ్యాయి. గట్టిగా కురిస్తేనన్నా బావుణ్ణు నీళ్ల సమస్యన్నా తీరిపోను. ఊరికే నాలుగు చినుకులు నేలని తడిపి వెళ్తున్నాయి. ఇంటిని చేరే లోపల నా కోరిక విన్నట్లు నిజంగానే వర్షం పెద్దదయింది. కెనటిక్ పార్క్ చేసి లోపలికి వెళ్లబోతూ చూశాను. ఎవరో చిన్నపిల్ల యూనిఫామ్‌లో గోడవారగా నించునుంది. 'బహుశా వాన గనుక నిలుచుంది గామోను' అనుకుంటూ తాళం తీసుకు లోనికెళ్లాను.

తల తుడుచుకుని బట్టలు మార్చుకుని కాఫీ కప్పుతో కిటికీ పక్కన సెటిలయ్యాను. కిటికీలు బయటి ప్రపంచానికి వాకిళ్లని ఎవరో అన్నది ఎంత సత్యం. వెచ్చటి కాఫీ గొంతు దిగుతున్నా ఇంట్లో ఒంటరిగా ఉన్న దిగులు మనసును తెలుస్తూనే ఉంది. ప్రదీప్ ఉంటే బావుణ్ణు. ఇలా ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే ఇవన్నీ తప్పవుగా. నేను వచ్చేసరికి సాయంత్రమవుతుంది. ప్రదీప్ అప్పటికి నైట్ డ్యూటీకి వెళ్లిపోయుంటాడు. తిరిగి రేపు నేను ఆఫీస్‌కి వెళ్లబోయే ముందే రావడం. అందుకే చందూ చిన్నవాడయినా హాస్టల్‌లో చేర్చాల్సొచ్చింది. అన్నిటికీ దూరాల్ని కలిపే దారల్లా టెలిఫోన్లే శరణ్యం. 'ఏమిటో! డబ్బు లెక్కువయ్యే కొద్దీ మనసులు చిన్నవవుతున్నాయేమో.'

బయట వర్షం ఎక్కువయినట్లుంది. కిటికీలో నుంచి చూసేప్పటికి ఆ పిల్ల వణకుతూ ఇంకా అక్కడే నిల్చుని కనిపించింది. 'అయ్యో తడిచిపోయింది' అనుకుంటూ గొడుగు పట్టుకు గేటు వరకూ వచ్చి లోనికి పిల్చాను ఎవరో పాపం! వాళ్ల అమ్మ తీసికెళ్లను రాలేదేమో. అయినా ఇంత చిన్నదాన్ని స్కూలు నుండి తెచ్చుకోవద్దూ. వాళ్ల అమ్మానాన్నలు కూడా మాలాగే ఆఫీసుల్లో ఇరుక్కుపోయారేమో అనుకునేసరికి ఎవరో చెళ్లున చరిచినట్లయింది. అమ్మ రాలేదని ఏడుస్తున్నట్లుందని సముదాయించి టవలిచ్చాను. వాన తగ్గాక నేనయినా విడిచొద్దామని అడిగాను వాళ్ల ఇల్లెక్కడని. సమాధానం రాలేదు గానీ కాసింత సేపు ఆ పిల్ల దుఃఖసంద్రమే అయింది. లాలనగా అడిగాక వెక్కిళ్ల మధ్య చెప్పటం మొదలెట్టింది.

"మేము ఆ పక్కవీధిలో ఉంటామాంటీ. నేనూ, అమ్మానే ఉంటాం. నాన్న దేవుడి దగ్గరకెళ్లిపోయాడంట. నిన్న..." వెక్కిళ్ల మధ్య మరోసారి దాని కళ్లు వరదలయ్యాయి. అసలా వెక్కిళ్ల మధ్య చెప్పటం దానికి సాధ్యమవ్వట్లేదు. కాసేపటికి మళ్లీ ప్రారంభించింది. "నిన్న అమ్మని లారీ గుద్దేసిందట. పోలీసులు అమ్మని తీసుకెళ్లిపోయారంట. అమ్మ కూడా నాన్న దగ్గరకే వెళ్లిపోయిందనీ, ఇంకెప్పటికీ అమ్మ రాదనీ పక్కింటి పద్మత్త చెప్పింది. నాకు అమ్మ కావాలాంటీ" అంటూ బావురుమంది. నా మనసు మొద్దు బారిపోయింది. కనీసం ఐదేళ్లన్నా లేవు ఎందుకింత కష్టం.

'మరి ఈ పాప తాతగారు వాళ్లు వెతుక్కుంటున్నారేమో' అదే అడిగాను. సమాధానంగా "వాళ్లెవ్వరూ రారంట. ఎందుకంటే మా అమ్మా నాన్న వేర్వేరు కులమంట. అట్లాని మా అమ్మ పద్మత్తతో చెప్తుండేది" అంది. దాని చిన్ని చెక్కిళ్లపై జారే కన్నీళ్లనీ, వదలని కులం కంపుని తల్చుకుంటే రోతప్పించింది.

చీకటి చిక్కబడింది. దానిని లోనికి పిల్చి మా వాడి చొక్కా ఇచ్చి మార్చుకొమ్మని భోజనం పెట్టాను. చాపపైన పడుకోబెడితే ఏడ్చి అలసిపోయినట్లుంది. వెంటనే నిద్రలోకి జారిపోయింది. దాని పేరు 'ప్రేమ' అట. బహుశా వాళ్ల అమ్మ, నాన్నల ప్రేమకు గుర్తేమో. మనసంతా చేదుగా అయిపోయింది. భోజనమూ చెయ్యబుద్ధవ్వలేదు. మాదీ ప్రేమ వివాహమే. 'ఒకవేళ మేమిద్దరమూ చచ్చిపోతే చందూ కూడా ఇలానే అయిపోతాడా' అనుకుంటే గుండె వణికిందోసారి. కులమంటే ఎంత పట్టింపు ఉంటే ఇంత చంటిదాన్ని ఇలా ఎలా వదిలేయగలిగారు. ఇప్పుడేమిటి చేయడం. రేపు ప్రదీప్ వచ్చాక తీసుకెళ్లి అనాథాశ్రమంలో చేర్చేస్తేనే. ఆలోచిస్తూ ఆ పిల్లవంక చూశాను. నిద్దట్లో అది ఇంకా వెక్కుతోంది. ప్రదీప్‌కెల్లా చెప్పడం. ప్రదీప్ ఎప్పుడూ ప్రేమికుల్నే బలపరిచేవాడు. ప్రదీప్ స్నేహితులెవరైనా ఇలా ప్రేమించి పారిపోయొస్తే వచ్చేది మా ఇంటికే. కథలన్నీ కంచికి చేరేట్లు ప్రేమికులంతా పెళ్లికి తిరుపతికి పరిగెత్తడం మామూలేగా. వెంటనే తను వాళ్ల పెళ్లి జరిపించి ముందుజాగ్రత్తగా రిజిస్ట్రేషన్ చేయించి వీలైతే వాళ్ల వాళ్లని ఒప్పించి పంపేవాడు. వాళ్ల పెద్దవాళ్లతో మొహం వాచేట్లు చీవాట్లు తిన్న సందర్భాలూ బోలెడు. అందుకే నేను ప్రేమపెళ్లిళ్ల పేరయ్య అంటూ వెక్కిరించేదాన్ని. ఎప్పుడైనా "నీకెందుకురా ఇవన్నీ" అంటే "వీళ్లంతా మన వాళ్లురా, మనమంతా ప్రేమికులం. మనది ప్రేమకులం. కొన్నాళ్లకు చూడు కులాలన్నీ మాసిపోయి మన కులమే కావాలి ప్రపంచమంతా" అనేవాడు. అయితే ఈ పిల్ల మన కులమన్నమాట.

ఈమధ్య ప్రదీప్ మెల్లిగా అప్లికేషన్లు పెడుతున్నాడు. "మనకి ఓ పాప ఉంటే బావుంటుందిరా" అంటూ. ఒకళ్లనే చూసుకోలేక హాస్టల్లో వేశాం" అంటూ నేనే ముందు వెనకాడుతున్నాను. ఇది గుర్తుకు వచ్చాక ఈ పాపని ఎక్కడ వదలాలన్న నా సమస్యకి పరిష్కారం దొరికినట్లయింది. పాపని పెంచుకోవటానికి ప్రదీప్‌ని ఒప్పించడం కష్టమవ్వబోదు. దానికి వాళ్ల అమ్మనయితే తెచ్చివ్వలేను గానీ మేము మరో జత అమ్మ, నాన్న అవ్వగలం కదా అనుకున్నాక మనసు తేలిక పడింది. అవును! నా అరియర్స్ ఎలా సరిగా ఖర్చు చేయొచ్చో ఇప్పుడర్థమయింది. ఆ పాప పేరున బ్యాంకులో వేసి దాన్ని చదివించాలి. 'ప్రేమ'ని హాల్లో నుండి తీసుకొచ్చి బెడ్‌పైన పడుకోబెట్టాను. నిద్దట్లో నవ్వుకొంటోంది. దాని నవ్వు ముందు నా రవ్వలదుద్దుల కోరిక చిన్నదనిపించింది. దాని చిన్న చెయ్యి మీదేసుకు పడుకున్నాను. మరో జంట కలల 'ప్రేమ' మా జంట ఒళ్లో వికసించబోతుంది. "భగవాన్! రేపటి వెలుగురేఖలు, ఆ చిట్టి గుండె దిగులు చీకట్లని పారదోలాలి."

-ఎ.భారతి (ముంబయ్)

తప్పించుకున్నా దాన్ని తీర్చుకోవడానికి మరో జన్మ ఎత్తక తప్పదు. అలాంటప్పుడు 'పూర్వజన్మకృతం పాపం భార్య రూపేణ పీడితే" అని నీవు ఎందుకనుకోకూడదు. నీ పాపాలను తొలగించడానికి దేవుడు నీకిచ్చిన అదృష్టంగా భావించాలి. నీ భార్య తిట్లన్నీ నీకు దీవెనలే అనుకుంటే నీకు కష్టాలే ఉండవు. ఆలోచించుకో" అంటూ వెళ్లిపోయాడు సాధువు.

"కష్టాలకు మరణం సమాధానం కాదు. ఎదిరించి పోరాడి గెలిస్తేనే జీవితానికి సార్థకత. నా అజ్ఞానాన్ని తొలగించిన మీకు కృతజ్ఞతలు. నేను చావను, చావను" కలవరిస్తున్నాడు శాంతమూర్తి.

"ఈ రోజు స్కూలుకు వెళ్లరా. కలవరిస్తూ పడుకున్నారు" తట్టి లేపింది సుగుణ. ఉలిక్కిపడి లేచాడు శాంతమూర్తి.

"అంటే ఇంతసేపు నేను కలగన్నానన్నమాట. కలలోనైనా చక్కని జ్ఞానోదయం కలిగింది" హుషారుగా లేచాడు. అన్ని బంధాలు తెంచుకున్న నిస్సంగునిలా, శత్రువుని జయించిన వీరునిలా మహదానందంతో పాఠశాలకు బయలుదేరాడు శాంతమూర్తి.

-టి.రామాంజనేయులు (హొలహర్వి)